మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# గ్రామగ్రామాన కుటీర పరిశ్రమలు రావాలి

- ఆహార రంగంలో నాణ్యమైన ఉత్పత్తులకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంది
- తెలంగాణ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం ఇస్తుంది
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



పెద్దగూడెం గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను ప్రారంభిస్తున్న మంత్రి

**వనపర్తి ప్రతినిధి, జూలై 31 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామంలో తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, పీఎం సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారి సంస్థల క్రమబద్దీకరణ పథకం సహకారంతో మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన వేరుశనగ డికార్డింగ్, ఆయిల్ తయారి యూనిట్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. గ్రామగ్రామన కుటీర పరిశ్రమలు రావాలని, ఆహార రంగంలో నాణ్యమైన ఉత్పత్తులకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని ఆయన అన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. సాగునీటి రాకతో తెలంగాణలో పంటల ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయన్నారు. మార్కెట్ లో డిమాండ్ కు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. వేరుశనగ, కంది, పప్పుశెనగ, శనగ పంటల సాగుకు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రసిద్ధి చెందిదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాగునీటి రాకతో వేరుశనగ సాగు గణనీయంగా పెరిగిందన్నారు. దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు అవుతుండడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పెద్దగూడెం మహిళా సంఘాల మహిళలు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# మళ్లీ తెరపైకి.. పాలమూరు - రంగారెడ్డి

- నాడు గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి లేదంటూ వివాదం
- నేడు భద్రత కరువై కూలీల మృత్యువాతతో దుమారం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు
- సంఘటనా స్థలాన్ని సందర్శిస్తున్న రాజకీయ ప్రముఖులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 31 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శరవేగంగా జరుగుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మరోసారి తెరపైకి వచ్చి వివాదంలో చిక్కుకుంది. మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి, నల్గొండ, హైద్రాబాద్ జిల్లాల పరిధిలో సాగు,తాగునీరందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. కృష్ణానది బ్యాక్‌వాటర్ ప్రామాణికంగా ఈ ప్రాజెక్టును వేలాది కోట్లు ఖర్చుచేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పనులు చేపట్టారు. అయితే మొదటినుంచి ఈ ప్రాజెక్టు పనులకు అంతరాయం కలుగుతూనే ఉంది. గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి లేదంటూ నాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఫిర్యాదులు రాగా, మరికొంతమంది ఈ ప్రాజెక్టు పనితీరుపై కోర్టుకు వెళ్లారు. అవాంతరాల మధ్య ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. కాగా తాజాగా ఈ ప్రాజెక్టు పనుల్లో రక్షణ, భద్రత కరువై ఐదుగురు కూలీలు మృత్యువాత పడ్డారు. దీంతో మళ్లీ రచ్చరచ్చ మొదలైంది. కాంట్రాక్టు పనులు చేపట్టిన కంపెనీలపై సర్వత్రా తీవ్ర విమర్శలు మిన్నంటాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని రేగుమాన్‌గడ్డ వద్ద ప్యాకేజీ -1 పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పంపుహౌస్ పనుల్లో భాగంగా క్రేన్ సహాయంతో లోపలికి దిగుతుండగా క్రేన్ వైర్ తెగిపడి ఐదుగురు కూలీలు అక్కడికక్కడే చనిపోయారు. ఊహించని రీతిలో ఈ ప్రమాదం జరగడంతో ఇటు కూలీలు, అటు అధికారులు మరోపక్క ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చనిపోయిన వారంతా జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు చెందినవారే. ప్రమాదకరమైన పనులు జరుగుతున్న సమయంలో అన్నిరకాల భద్రతా చర్యలు చేపట్టకుండా సదరు కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేయడం వల్ల అమాయక కూలీల ప్రాణాలు పోయాయని రాజకీయ ప్రముఖులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ సంఘటనపై బీఎస్పీ, వామపక్షాలు, కార్మిక సంఘాల నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఈ సంఘటన స్థలాన్ని సందర్శిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో అగ్రనేతలైన టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వైఎస్ఆర్ పార్టీ నాయకురాలు షర్మిళ, వామపక్ష నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి, బీఎస్పీ ప్రముఖ నాయకులు పాలమూరు-రంగారెడ్డి ఐదుగురు మృత్యువాత సంఘటనపై ఎవరికి వారుగా స్టేట్‌మెంట్‌లు ఇచ్చారు. మృతిచెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సంఘటనకు బాధ్యులైన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, పాలమూరు-రంగారెడ్డి పథకం పనుల్లో భద్రతా చర్యలు చేపట్టాలని, కూలీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు సంఘటనా స్థలానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. టిఆర్ఎస్ అసంతృప్తి నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తర్వాత అత్యంత వేగంగా పనులు జరుగుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు రుణాలిచ్చేందుకు కేంద్రం రుణ సంస్థ అయిన పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పోరేషన్ ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఈ సంఘటన చోటు చేసుకోవడంతో అధికారవర్గాలు కలవరంలో పడ్డాయి.



# కులం, మతం కాదు.. అభివృద్ధే లక్ష్యం

- ఎవరు అభివృద్ధి చేస్తున్నారో జనం చేస్తున్నారు
- తమ హయాంలో మహబూబ్‌నగర్ రూపురేఖలు మారిపోయాయి
- పార్టీ చేరికల సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 31 ప్రభాతవార్త :** తమకు కులాలు, మతాల పట్ల రెట్టింపు లేదని కులమతాలకతీతంగా అభివృద్ధే అజెండా అని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని 24వ వార్డు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో ఎంఐఎం, టిడిపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సయ్యద్ అబ్దుల్ సుల్తాన్ సాహెబ్, అశ్వక్ రసూల్ సాబ్, అజార్ అహ్మద్ సాబ్ సహా సుమారు 500ల మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలు మహబూబ్‌నగర్ న్యూటౌన్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ఎదుట అధికార పార్టీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ పట్టణం రూపురేఖలు మారిపోయాయన్నారు. మెడికల్ కాలేజీ, కెసిఆర్ అర్బన్ ఎకోపార్కు, బైపాస్, మిని ట్యాంక్‌బండ్, శిల్పారామం, ఐటిపార్కు వంటి అభివృద్ధి పనులతో జిల్లా కేంద్రాన్ని అభివృద్ధికి తలమానికంగా చేస్తున్నామన్నారు. రోడ్డు , మౌలిక వసతుల కల్పనలో మహబూబ్‌నగర్ ఉత్తమ స్థానంలో నిలబడిందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను సైతం వేగంగా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, మార్కెట్ కమిటి ఛైర్మన్ రెహమాన్, పిఎసిఎస్ ఛైర్మన్ జూపల్లి భాస్కరరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గణేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కార్యదర్శి వినోద్, పార్టీ నాయకులు కట్టా రవికిషన్‌రెడ్డి, పాషా, నవకాంత్, షబ్బీర్, సత్యంయాదవ్, జావెద్, సుల్తాన్ పాల్గొన్నారు.

# పిఆర్ఎల్ఐ పనులలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలి

- ఏజెన్సీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- మాజీ మంత్రి కాంగ్రెస్ నాయకులు నాగం జనార్ధన్‌రెడ్డి



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్,జులై 31 ప్రభాతవార్త :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ఫేస్ వన్ పనులలో మూడు ప్రమాదాలు జరిగిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మాజీ మంత్రి కాంగ్రెస్ నాయకుడు నాగం జనార్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబర్ నెలలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదు, ముఖ్యమంత్రి కనుసైగలలోనే అంచనాలు టెండర్లు, టెండర్ ప్రక్రియలో లోపించిన పారదర్శకత ముఖ్యమంత్రి కాంట్రాక్టర్లు కుమ్మక్కు కావడం వల్లే డిజైన్ మార్పు జరిగిందని అన్నారు. నిపుణుల కమిటి అండర్ గ్రౌండ్ పనులు వద్దని సూచించిన ఎందుకు అంచనాలు పెంచారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకున్నది చాలు మిగిలిన 17 నెలలైనా సేవలందించండని అన్నారు. మృతదేహాలను నేరుగా ఉస్మానియా మార్చురీకి తరలించడం నేరమన్నారు. కెఎల్ఐ ఎత్తిపోతల పథకంలో ఐదు మోటార్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువుల కింద కాదు కాలువల సామర్థ్యం పెంచి పూర్తి ఆయకట్టుకు నీరందించాలన్నారు. అధికారులు, నేతల కుమ్మక్కుతోనే ప్రాజెక్టులలో అక్రమాలు ప్రజాధనం దోపిడి జరుగుతుందని తెలిపారు. పాత్రికేయుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థంరవి, మున్సిపాలిటీ అధ్యక్షులు తిమ్మాజిపేట పాండు, కౌన్సిలర్లు సునీంద్ర సుల్తాన్, నిజాముద్దిన్, నాయకులు సలీం అర్జునయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# దళితుల అభ్యున్నతికి కృషిచేసిన నాయకుడు కెసిఆర్

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



లబ్దిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

**ధరూరు, జూలై 31, ప్రభాతవార్త:** దళితుల అభ్యున్నతికి కృషిచేసిన నాయకుడు కెసిఆర్ అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ధరూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దళిత బంధు పథకం కింద మంజూరైన వివిధ ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మండల కేంద్రానికి చెందిన పద్మమ్మకి దళిత బంధు ద్వారా రూ.10లక్షల వ్యయంతో నిహారిక ఇంజనీరింగ్ వర్క్‌షాప, అల్వాల్‌పాడు గ్రామానికి చెందిన రమేష్‌కు రూ.10లక్షలతో అన్విత్ ట్రేడర్స్ సిమెంట్, ద్యాగదొడ్డికి చెందిన పెద్ద కర్రెన్నకు రూ.10లక్షలతో ప్రవీణ్ టెక్స్‌టైల్స్ షాపు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు దళితులను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా ఉపయోగించుకున్నాయన్నారు. ఎలాంటి అభివృద్ధికి కృషిచేయలేదన్నారు. దళిత బంధు ద్వారా ప్రతి దళిత బిడ్డ అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కు అందజేత..** మండల కేంద్రంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. నర్సింహులు రూ.1లక్ష, గోవిందుకు రూ.1లక్ష, సుజాతకు రూ.60500, ఖాజాహుసేన్‌కు రూ.52వేలు, మహేశ్వరికి రూ.48వేలు, నాగరాజుకు రూ.45వేలు, లక్ష్మికి రూ.44వేలు, గోవిందుకు రూ.35900, జయమ్మకు రూ.33600, కిష్టప్పకు రూ.26వేల, సుజాతకు రూ.16వేలు, ఆంజనేయులుకు రూ.14వేలు చొప్పున చెక్కులను చికిత్స నిమిత్తం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా 50 శాతం డబ్బులను లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. నిరుపేదలకు ఈ పథకం ఆపద సమయాల్లో ఎంతో అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చెన్నయ్య, ఎంపిపి నజుమున్నిఆబేగం, జడ్పిటిసి పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ పద్మ, ఎంపిటిసి దౌలన్న, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు వీరన్నగౌడు, మహేశ్వరమ్మ, నాగన్న, నాయకులు జాకీర్, ప్రభాకర్‌గౌడు, శ్రీరాములు, వెంకటేష్, రామకృష్ణ నాయుడు, అంజి సాగర్, మండల యూత్ అధ్యక్షుడు పురుషోత్తమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు
- ఆపరేషన్ ముస్కాన్ 8లో 166 మంది బాల కార్మికులకు విముక్తి



జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు

**మక్తల్, జులై 31 ప్రభాతవార్త :** ఆపరేషన్ ముస్కాన్ -8 కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ -8 కార్యక్రమం జులై 1 నుండి 31 వరకు నారాయణపేట జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరాయంగా నెలరోజుల పాటు జరిపిన ఆపరేషన్ ముస్కాన్ -8 తనిఖీల్లో మొత్తం 166 బాలలు చదువులకు దూరంగా వివిధ రకాలైన పనులలో అవి ముఖ్యంగా గొర్రెల కాపరులుగా, మెడికల్ షాపుల్లో, కిరాణా షాపుల్లో, హోటళ్లలో, ఇటుక బట్టీలలో, రెస్టారెంట్లలో, భవన నిర్మాణ కార్మికులుగా బిక్షాటన చేస్తూ చదువుకు దూరంగా ఉండి వివిధ రకాల పనులలో బాల కార్మికులుగా ఉన్నట్లు గుర్తించి 166 మంది బాల కార్మికులను పట్టుకోవడం జరిగింది. వారిలో 153 బాలురు, 14 బాలికలు కలరు. మొత్తం బాల కార్మికులను తదుపరి (సిడబ్ల్యుసి) చైల్డ్ వెల్ఫేర్ కమిటి ముందర హాజరు పరిచి పిల్లలకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి బాలకార్మికులుగా పెట్టుకున్న యజమానులకు రూ. 30 వేల ద్వారా జరిమానా విధించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. మొత్తం 166 మందిలో 35 మంది బాల కార్మికులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారున్నారు. వారి తల్లిదండ్రులు ఇక్కడ ఉంటే కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం జరుగుతుంది. లేని ఎడల ఆయా రాష్ట్రాల (కర్ణాటక, రాజస్థాన్, బీహార్, ఒరిస్సా, జారఖండ్) సిడబ్ల్యుసి కమిటీలకు అప్పగించడం జరుగుతుందని తెలిపారు. చిన్నపిల్లల బాల్యం ఎంతో విలువైనదని చదువుకునే వయసులో వారికి తగిన స్వేచ్ఛను ఇస్తూ ఆట పాటలతో పాటు చదివించడం ఎంతో అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చక్కగా చదివించాలని సూచించారు. నారాయణపేట జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలను కోరారు. అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన,తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాల కార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలుపుతూ ఆపరేషన్ ముస్కాన్ -8 బృందం వారు ఎస్సై, ఎండి శంషుద్దిన్, కానిస్టేబుళ్ల ప్రభాకర్, బాలరాజ్, పార్వతమ్మ, పోలీస్ శాఖతో కలిసి కృషి చేసిన వివిధ శాఖల అధికారులను ఎస్పీ అభినందించారు.

# టీఆర్ఎస్ పార్టీ నాయకులు యాదగిరి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, జులై 31, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకులు యాదగిరి ఆదివారం ఉదయం గుండెపోటుకు గురి కావడంతో చికిత్స నిమిత్తం ఆమనగల్లులోని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ సంజీవ్‌కుమార్‌యాదవ్ రూ.5వేలు, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్ రూ.10వేలు, శేఖర్ ముదిరాజ్‌లు రూ.3వేలు, ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అలీ, నాయకులు నారాయణనాయక్, వెంకటయ్య, బాబురావు, రాంచంద్రయ్య, బాల్‌చెన్నయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

- ఎమ్మెల్యే సంపత్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

**అయిజ, జూలై 31, ప్రభాతవార్త :** రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆది వారం మండల కేంద్రంలోని రాయల ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ.. ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ భాగోతాలను ఎండగడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. డిసిసిబి అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి మాస్టర్ షెక్షావలి ఆచారి, మానవపాడు మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి దేవేంద్ర, కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు నాగశౌమని, జిల్లా సేవాదళ్ మహిళా అధ్యక్షురాలు సులోచనమ్మ, కౌన్సిల్ గిత్తల దేవరాజు, బ్లాక్ కాంగ్రెస్ పాండురంగడు, బసవరాజు, శాలి, మైనర్‌బాబు, దేవేంద్ర, ఫిరోజ్, ముత్యాలన్న, రాముడు, నక్క సురేష్ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన..



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్

**వనపర్తి టౌన్, జూలై 31 ప్రభాతవార్త:** మంత్రి కేటీఆర్, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిమిషాల ప్రోగ్రాంలో భాగంగా వనపర్తి మున్సిపాలిటీలో ఛైర్మెన్ గట్టుయాదవ్ అధ్యక్షతన 18, 19, 20వ వార్డులలో ఉదయం 10గం10ని ప్రోగ్రాంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఇంటిలో వాటర్ ట్యాంక్ క్లీన్ చేయడం, బ్లీచింగ్ చల్లడం, కొబ్బరి బోండాలు, ఇంటిలోని పాత వస్తువులు శుభ్రం చేసుకోవాలని తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ లు పాకనాటి కృష్ణయ్య, శర్వానంద్, ఎల్ఐసి కృష్ణ, మేనేజర్ ఖాజా, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, మెప్మా సిబ్బంది బాలరాజు, ఆర్పీలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

# ప్రజా పంపిణీకి నాణ్యమైన బియ్యాన్ని తరలించాలి - అదనపు కలెక్టర్ మోతిలాల్



రైస్ మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్



రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జూలూరి రమేష్‌బాబుతో కలిసి మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

**కల్వకుర్తి, జులై 31, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని రైస్‌మిల్లులను, ప్రజా పంపిణీ స్టాక్ పాయింట్లను ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్ అకస్మికంగా తనిఖీ చేశారు. సీఎంఆర్ డెలివరి, గన్నీ బ్యాగుల లభ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ డెలీవరిలలో వేగం పెంచాలని, మిల్లలకు కేటాయించిన ధాన్యం వెను వెంటనే ఆన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సీఎంఆర్ బియ్యం డెలివరీలను వేగవంతం చేసేందుకు ప్రతి మిల్లుకు ఒక సూపర్‌వైజర్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మిల్లుల యజమానులు ఎఫ్‌సీఐ, సీఎంఆర్ తరలింపుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. రోజు వారి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీకి పకడ్బంది చర్యలు చేపట్టాలన్నారు. నేటి నుంచి స్టాక్ పాయింట్ల నుంచి ప్రజా పంపిణీకి తరలించే బియ్యం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని చౌక ధర దుకాణాలకు నాణ్యమైన రేషన్ బియ్యాన్ని స్టాఫ్ పాయింట్ల నుంచి రేషన్ నుంచి రేషన్ దుకాణాలకు తరలించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా మిల్లుల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కంకణ బద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల డీఎం సివిల్ సప్లై బాలరాజు, డీటీ నర్సింగ రాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జూలూరి రమేష్‌బాబు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమన్వయ కర్త కంది ప్రవీణ్, సభ్యులు సంబు వెంకటరమణ, లింగం, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

## వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**శ్రీరంగాపురం, జూలై 31 ప్రభాతవార్త:** వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వానాకాలం రావడంతో వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్యశాఖ డిఎంహెచ్ఓ ఆదేశాను సారం ఆదివారం సెలవు దినాలలో కూడా మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలు ఎలా జాగ్రత్త పడాలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తు అలాగే జ్వరం సర్వేలు నిర్వహిస్తున్నారు. ఎవరికైన జ్వరం తదితర అనారోగ్య సమస్యలు ఉంటే శ్రీరంగాపురం పిహెచ్‌సి సెంటర్ కు వెళ్లవలసిందిగా ఆశా కార్యకర్తలు సూచించారు. జ్వరం, తలనొప్పి, జలుబు తదితర ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే వారికి కిట్స్ అందించడం జరుగుతుందని వారు తెలిపారు. దోమల వల్ల సంక్రమించే వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి ప్రజలు తమ ఇళ్లలో కాళీ కుండలు, పాతటైర్లు, ఖాళీ డబ్బలు ఉన్న వాటిని తొలగించాలని అలాగే మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంటి చుట్టు గుంతలు లేకుండా చూసుకోవాలని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీదేవి, ఆశవర్కర్లు జ్యోతి, క్షలత, జానకి, భాగ్య, ఉష, తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం

## రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు సంఘటితం కావాలి

### - బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి టౌన్, జూలై 31 ప్రభాతవార్త:** బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ను ఢిల్లీలో జరగబోయే ఓబీసీ మహాసభకు మద్దతు తెలిపిన వనపర్తి జిల్లా అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ తదితర నేతలు కలిశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు సంఘటితం కావాలని ఆగష్టు 7వ తేదీన ఢిల్లీలో పదివేల మందితో జరగబోయే ఓబీసీ మహాసభకు అందరు హాజరు కావాలని వనపర్తి నుండి సతీష్ యాదవ్ కు వారి సహచరులకు ఆహ్వానం పలుకుతున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే ఏ పార్టీ బీసీలకు రాజ్యాధికారాన్ని కట్టబెడదామని, మనకు ఉన్న శాతం ప్రకారం సీట్లు ఇవ్వలేదని, వారి స్వార్థ రాజకీయాలకు బీసీ లను పావులుగా వాడుకుంటున్నారని, మన రాజ్యాధికారాన్ని మనమే సాధించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం పాటుపడే ఢిల్లీలో జరిగే ఈ మహాసభకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, మేము కూడా ప్రత్యక్షంగా పాల్గొంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్, వైఎస్ఆర్ టీపీ సతీష్, అడ్వకేట్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, అచలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్

## స్వర్గీయ మాజీ మంత్రి మహేంద్రనాథ్ సేవలు మరువలేనివి

### -కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి


**నాగర్‌కర్నూల్, జూలై 31 ప్రభాతవార్త :** మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్, మాజీ మంత్రి స్వర్గీయ మహేంద్రనాథ్ సేవలు మరువలేనివని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రివర్యులు కొనియాడారు. రాష్ట్రానికి నాగర్‌కర్నూల్ జిల్లాకు మహేంద్ర సేవలు మరువలేనివని ఆయన అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్, మహేంద్రనాథ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, నిజాముద్దిన్, బండి మల్లయ్య, బాలాగౌడ్, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్, మహేంద్రనాథ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## మూడా బోర్డుమెంబర్ కర్ణంరాజుకు మైనార్టీల ఘనసన్మానం

**దేవరకద్ర రూరల్, జూలై 31 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (మూడా) బోర్డుమెంబర్ దేవరకద్రకు చెందిన కొవ్వూరి లక్ష్మీకాంతరావు (కర్ణంరాజు)ను ఆదివారం స్థానిక మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి(మూడా) బోర్డుమెంబర్ దేవరకద్రకు చెందిన కర్ణంరాజు గత నెల 30న ప్రామాణస్వీకారం చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా దేవరకద్ర మండలంలోని వివిద గ్రామాలకు చెందిన మైనార్టీ నాయకులు కర్ణంరాజును ఘనంగా సన్మానించారు. టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, దేవరకద్ర పిఏసిఎస్ చైర్మెన్ డోకూర్ నరేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖదీర్‌పాష, నాయకులు గౌస్, మైబల్లి, ఖాజా. జకీ, పాష, హజ్జు , వెంకటేశ్, దొబ్బలి అంజనేయులు, కొండ భాస్కర్‌రెడ్డి, కొండల్ పాల్గొన్నారు.



కర్ణంరాజును సన్మానిస్తున్న మైనార్టీనాయకులు

## గ్రామంలో బూత్ కమిటీల ఏర్పాటుకు కృషి

### - బీఎస్పీ మండల అధ్యక్షులు యాదగిరి

**రాజాపూర్, జులై 31 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మండల అధ్యక్షులు కాకరాజాల యాదగిరి అధ్యక్షతన ఆదివారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో పలు ముఖ్యమైన విషయాలపై చర్చించడం జరిగింది. క్యాడర్ పంపు, బూత్ కమిటీలు, గ్రామ గ్రామాన ఏనుగు గుర్తును పరిచయం చేయడం, అనే విషయాల పట్ల చర్చించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ ఇంఛార్జి ఆంజనేయులు, అసెంబ్లీ అధ్యక్షులు లీడర్ శ్రీను, రమేష్, గోపాల్, వెంకటయ్య, గువ్వల రవి, జంగయ్య, చెన్నయ్య, నర్సింలు, కుమార్, శేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.



బీఎస్పీ బూత్ కమిటి ఏర్పాటు చేసిన దృశ్యం

## మొహర్రం వేడుకలకు సన్నాహాలు

**దేవరకద్ర రూరల్, జులై 31 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలో మొహర్రం వేడుకలకు ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రతిఏడాది మండలంలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. సోమవారం నుండి మొహర్రం వేడుకలు ప్రారంభం కానున్నాయి. మండలంలోని కౌకుంట్ల, గోపన్‌పల్లి, పెద్దరాజమూర్, చౌదర్‌పల్లి, జీన్గరాల, గద్దెగూడెం, డోకూర్ గ్రామాలలో మొహర్రం వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. దాదాపు వారం రోజుల పాటు ఆయా గ్రామాలలో మొహర్రం వేడుకలను సాంప్రదాయరీతిలో ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి రోజు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను పీర్ల చావిడీల వద్ద నిర్వహిస్తారు. వేడుకల సందర్భంగా ఆయా గ్రామాలలోని పీర్ల మజీదులను రకరకాల విధ్యుత్‌బల్బులతో సర్వాంగ సుందరంగా ముస్తాబుచేస్తున్నారు. అలయ్ గోతులను ఏర్పాటు చేస్తున్నారు.



కౌకుంట్ల పీర్లమజీదు వద్ద భూమిని చదునుచేస్తున్న దృశ్యం

# దళితుల అభ్యున్నతికి పరితపిస్తున్న సీఎం కెసిఆర్

### - ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాల ప్రతినిధి, జులై 31 ప్రభాతవార్త :** గద్వాల పట్టణంలో 2వ వార్డుకు చెందిన రాజు దళితబంధు ద్వారా లబ్దిదారునిగా ఎంపికై రూ. 10 లక్షల వ్యయంతో ఎస్ఆర్ టెంట్ హౌస్‌ను ఎమ్మెల్యే ఆదివారం ఛైర్మన్ బిఎస్ కేశవ్‌తో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా గద్వాల టౌన్‌లోని గంజిపేటకు చెందిన జమన్న దళితబంధు ద్వారా ఎంపికైన రూ. 10 లక్షల వ్యయంతో లబ్ధిదారులు కావ్య సెంట్రింగ్ షాపును మంజూరు చేయడం జరిగింది. యూనిట్‌ను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యేకు ఛైర్మన్‌కు లబ్దిదారులు పుష్పగుచ్ఛం, నోటు పుస్తకాలు ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ దళితుల కోసం దళిత బంధు ప్రవేశపెట్టడం జరిగింది. దళితులను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే గత ప్రభుత్వాలు ఉపయోగించుకున్నారు. వారికి ఎలాంటి పథకాన్ని ప్రవేశపెట్టలేదు. వారి అభివృద్ధి కొరకు ఎలాంటి కృషి చేయలేదన్నారు. ప్రపంచంలో ఏ ప్రధానమంత్రికి ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కెసిఆర్‌కు రావడం జరిగింది. దళితులను కూడా ఆర్థికంగా ఎదగాలని దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టి దళితులు ఆర్థికంగా ఎదగాలి. దళితులు కూడా నలుగురికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలని దళితులు గతంలో ఓట్లువేసే యంత్రాలుగా ఉపయోగించుకున్నారు తప్ప వారికి ఏ మాత్రం కూడా ఇలాంటి ఆర్థిక సంబంధించిన పథకాలను గాని ప్రయోజనాలు గాని పెట్టలేదు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ దళితుల కోసం ప్రత్యేకంగా దళితబంధు, అదేవిధంగా ఎస్సీ కార్పోరేషన్ ద్వారా దళితుల మహిళలకు కుట్టు మిషన్లు, కుటీర పరిశ్రమలకు సంబంధించిన పరికరాలను అందజేస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలిచే నాయకుడు సీఎం కెసిఆర్ అని పేర్కొన్నారు. దళితబంధు మొదటి విడతగా నియోజకవర్గానికి యూనిట్లను పంపిణీ చేయడం జరిగింది. భవిష్యత్తులో మరికొన్ని యూనిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. దళితులు కూడా ఆత్మధైర్యంతో బతికేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన నాయకుడు సీఎం కెసిఆర్ అన్నారు. దళితబంధు ద్వారా ప్రతిఒక్క దళితబిడ్డ అభివృద్ధి చెందాలని ఆర్థికంగా ఎదగాలని అన్నది ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చెన్నయ్య, వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ రామేశ్వరమ్మ, వైస్ ఛైర్మన్ బాబర్, ఎస్సీ కార్పోరేషన్ ఈడి రమేష్‌బాబు, కౌన్సిలర్లు లక్ష్మినర్సమ్మ, గీతమ్మ, మురళి, నాగిరెడ్డి, నరహరి, శ్రీనివాసులు, కృష్ణమహేష్, నరహరిగౌడ్ గద్వాల టౌన్, తెరాస పార్టీ అధ్యక్షుడు శెట్టి, భగీరథ వంశీ కురుమన్న, రామకృష్ణనాయుడు, శ్రీరామ్‌రెడ్డి, కృష్ణ, వీరేష్, రాజు, తెరాస పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



టెంట్ హౌజ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## తెలంగాణ మాల మహానాడు కల్వకుర్తి పట్టణ మహిళా నూతన కమిటీ

**కల్వకుర్తి, జులై 31, ప్రభాతవార్త:** తెలంగాణ మాల మహానాడు కల్వకుర్తి పట్టణ మహిళా నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని తాలూకా అధ్యక్షులు ఎనుగొండ నరేందర్ అధ్యక్షతన కల్వకుర్తి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించారు. కమిటీ ఎన్నిక కార్యక్రమానికి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చింత సత్తి, ఉపాధ్యక్షులు రావులు శ్రీనివాసులులు ముఖ్య అతిథులుగా హాజరై కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలుగా కనుక భారతి, అధ్యక్షురాలుగా కందుకూరి ఝాన్సీ, ఉపాధ్యక్షురాలుగా ఎనుగొండ నవ్యశ్రీ, ప్రధాన కార్యదర్శిగా పెరుమండ్ల అలివేలు, ప్రచార కార్యదర్శిగా పావని, సహాయ కార్యదర్శిగా రాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చింత సత్తి, జిల్లా ఉపాధ్యక్షులురావుల శ్రీనివాసులు మాట్లాడుతూ నూతన కమిటీకి సూచనగా మహిళలపై జరుగుతున్న దాడులు, దళిత ఉప కులాలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలకు ఎండగట్టే విధంగా పనిచేయాలని సూచించారు. అదే విధంగా ఆగస్టు 5 నుంచి 12 వరకు ఢిల్లీలో నిర్వహించే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి మాలలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన పట్టణ మహిళా కమిటీని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

# సమస్యల నిలయంగా గురుకులాలు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రభుత్వం
- బిసిసేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్

**జడ్చర్ల, జులై 31 ప్రభాతవార్త :** నిరుపేద పిల్లల కోసం ఏర్పాటు చేసిన గురుకులాలు సమస్యలకు నిలయంగా మారాయని బిసిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. జడ్చర్ల పట్టణంలో నిర్వహిస్తున్న ఊరుకొండ పేటకు చెందిన మహాత్మా జ్యోతిబాపూలె బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు సరిపోను తరగతి గదులు సమకూర్చకపోవడం శోచనీయం అన్నారు. ఒకే తరగతి గదిలో రెండు తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటుందని, ఆరుగురు విద్యార్థులు ఉండాల్సిన హాస్టల్ గదిలో 20 మంది విద్యార్థులను ఒకే గదిలో ఉంచడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవనం శిథిలావస్థకు చేరుకుంది, స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడం వల్ల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, వందలాది గురుకుల పాఠశాలలు ఏర్పాటు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని గొప్పలు చెబుతున్నప్పటికి క్షేత్రస్థాయిలో మాత్రం గురుకుల పాఠశాలల నిర్వహణ పరిస్థితిని అధ్వానంగా ఉందని అన్నారు. ఇరుకు గదులతో సతమతమవుతున్న విద్యార్థులకు హాస్టల్ రూములలో ఫ్యాన్లు లేకపోవడం వల్ల దోమల బెడద ఎక్కువైందని నిద్రకూడా పట్టడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస మౌలిక వసతులైన బాత్‌రూములు కూడా సరిగ్గా లేవని బాలికలు ఆరుబయట స్నానం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనం చేయడానికి భోజనశాల కూడా లేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించి అధునాతన హంగులతో కూడిన నూతన భవనాలు నిర్మించాలని లేని ఎడల బిసిసేన ఆధ్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిసిసేన మండల అధ్యక్షులు మండ్లస్వామి, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి లింగంపేట శేఖర్, జిల్లా నాయకులు జగన్, గోపాల్, మాచారం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు, శివరాములు, ధనుష్, సురభి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న కృష్ణయాదవ్

# మద్దతు ధరల చట్టం చేయాలి

### - తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**నాగర్‌కర్నూల్ రూరల్, జులై 31 ప్రభాతవార్త :** కనీస మద్దతు ధరల చట్టం చేయాలని తెలంగాణ రైతు సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యవసాయ చట్టాలు ఉపసంహరణ చేసుకున్న సందర్భంలో రైతు ఉద్యమం నిర్వహించినప్పుడు సంయుక్త కిసాన్‌మోర్చా రైతు నాయకులకు రాతపూర్వకమైన హామీ ఇచ్చి నేటికి అమలు చేయకపోవడాన్ని రైతులకు ద్రోహం చేయడమేనని ఆయన దుయ్యబట్టారు. విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని దేశ వ్యాప్తంగా రైతులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని ఘటనకు బాధ్యుడైన కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని కనీస మద్దతు ధరల చట్టాన్ని చేయాలని రైతు రుణవిమోచన కమిషన్ ఏర్పాటు చేసి చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో నరెంద్రమోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను ఏదో రూపంలో తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని అందుకు దేశ రైతాంగం ప్రతిఘటించేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వ్యవసాయ రంగాన్ని రక్షించుకునే విధంగా ఉండాలని అన్నారు. రైతుసంఘం జిల్లా కమిటి సభ్యులు పి. శివశంకర్, నాగరాజుగౌడ్, నాయకులు సుభాకర్, కురుమయ్య, హనుమంతు, నరెందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌక్‌లో నిరసన తెలియజేస్తున్న రైతుసంఘం నాయకులు

# వైభవంగా నూతన గోశాల ప్రారంభోత్సవం

**బిజినేపల్లి, జులై 31 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వట్టెం ఆడ్డగట్టుపై గల శ్రీవెంకటేవ్వరస్వామి ఆలయం ఆవరణలో దాదాపు 20 లక్షల వ్యయంతో నిర్మించిన సందడి కుసుమ రంగారెడ్డిల స్మారక నూతన గోశాల ప్రాంగాణాన్ని ఆదివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామెదర్‌రెడ్డి తనయుడు రాజేష్‌రెడ్డి ప్రారంభించారు గోశాల ప్రధాన దాత సందడి సురేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో నూతన గోశాల నిర్వహణను సాంప్రదాయబద్దంగా గోపూజతో లాంచనంగా ప్రారంబించారు. ఈ సందర్బంగా దేవస్థాన గోశాల నిర్వహకులు మాట్లాడుతూ గోవుల సంరక్షణకు సౌకర్యవంతంగా ఉండేలా ఆదునిక సౌకర్యలతో ఈ నూతన గోశాలను సందడి సురేందర్‌రెడ్డి 12లక్షల రూపాయలు మరియు ఎమ్మెల్సీ నిదులు 5లక్షల రూపాయలను వెచ్చించి నిర్మించడం జరిగిందని మరిన్ని గోవులను సురక్షితంగా సంరక్షించే ఆవకాశం దీనివలన కలిగందని ఆన్నారు, హైందవుల ప్రత్యక్ష దైవమైనటువంటి గోమాతను రక్షించుకునేందుకు భక్తాదులు గోశాల నిర్వహణను మరింత మెరుగుగా నిర్వహించి ఆబివృద్ధి చేసేందుకు భక్తాదులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సందడిప్రతాప్‌రెడ్డి, సందడినరేందర్‌రెడ్డి, సందడిరామచంద్రరెడ్డి, చంద్రారెడ్డి, వికాస్ తరంగిణి ఉమ్మడి జిల్లా ఆద్యక్షుడు బండారు రాజశేఖర్, సర్పంచ్ ఆమృత్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.



గోశాలను ప్రారంబిస్తున్న కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

## కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

**శ్రీరంగాపురం, జూలై 31 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు గ్రామ పంచాయితీ సిబ్బందితో కలిసి నిర్వహించడం జరిగింది. సర్పంచ్ వినీల రాణి మాట్లాడుతూ వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని వివిధ వారుండలలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తించకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. గ్రామ ప్రజలు ఇంటి వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు చెత్తను అందించి గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని ఆమె కోరారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే నీరు ఆగి దగ్గర ఆయిల్ బాల్స్ వేయడం మరియు బ్లీచింగ్ పౌడర్ స్ప్రే చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చీర్ల శివసాగర్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయితీ మల్టీ పర్పస్ వర్కర్స్ పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితుడికి ఆర్థిక షహాయం



బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**గద్వాల క్రైం, జూలై 31, ప్రభాతవార్త:** మల్దకల్ మండల కేంద్రానికి చెందిన బోయ కనివిటి నర్సింహులు రెండు కిడ్నీలు చెడిపోయి ఆర్థిక పరిస్థితి లేనందున సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న మల్దకల్ మండలానికి చెందిన 2007 పూర్వపు 10వ తరగతి విద్యార్థులు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తానిన బాధితుడి ఇంటి చేరుకుని ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మరింత మంది ముందుకొచ్చి తమకు తోచిన సహాయాన్ని అందజేయాలని దాతలు కోరారు.

## జీవన్‌రెడ్డిని కలిసిన రాజాపూర్ నాయకులు

### -హనుమాన్ దేవాలయానికి రూ. 20 లక్షలు ప్రకటించిన జీవన్‌రెడ్డి



జీవన్‌రెడ్డిని కలిసి బొకే అందజేస్తున్న దృశ్యం

**రాజాపూర్, జులై 31 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు సభ్యులు మన్నె జీవన్‌రెడ్డిని ఆదివారం ఉదయం రాజాపూర్ మండల వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ బచ్చిరెడ్డి, మాజీ ఎంపిపి నర్సింలు, నరహరి, సత్తయ్య, అచ్చయ్య, బిజెపి నర్సింలు, వనపర్తి కృష్ణయ్య, ఎంజెఆర్ యువసేన నాయకులు మిల్క్ నర్సింలు, కుమ్మరి గోపాల్, బుగ్గయ్య, ప్రశాంత్ తదితరులు కలిశారు. ఆలయానికి రూ. 20 లక్షలు విరాళం ప్రకటించిన మన్నె జీవన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యాలు బాగుంటాయి

### - మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయి.



వార్డులలో పర్యటిస్తున్న దృశ్యం

**పెబ్బేరు, జూలై 31 ప్రభాతవార్త:** పరిశుభ్రతోనే ఆరోగ్యాలు బాగుంటాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయి అన్నారు. ఆదివారం పురపాలక కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశంతో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సలహాలతో వాతావరణ మార్పుల వల్ల కలిగే సీజనల్ వ్యాధులకు ప్రజలకు దూరంగా ఉండేందుకు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ప్రతి ఆదివారం 10 గంటల 10 నిమిషాలకు పరిశుభ్రత కార్యక్రమం భాగంగా 1వ వార్డులలో పర్యటించి మురికి నీటిని, నిలువ నీటిని తీసివేసి సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు కాలనీ ప్రజలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ గణేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, మెప్మా సిబ్బంది, శివ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉప్పల ట్రస్ట్ అండ

**కల్వకుర్తి, జూలై 31, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన ఆశోక్‌గౌడ్ గత కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మృతునికి భార్య పున్నమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆశోక్‌గౌడ్ మృతి చెందడంతో భార్య పున్నమ్మ రోజు వారి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. పిల్లల చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడటంతో ఇట్టి విషయాన్ని గ్రామానికి చెందిన శ్రీధర్ గుప్త తలకొండపల్లి మండల జెడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఉప్పల వెంకటేష్ ఆదివారం ఆశోక్‌గౌడ్ కుటుంబ సభ్యులను తన కార్యాలయంలో కలిసి భరత్ 8వ తరగతి, నవీన 7వ తరగతి చదువుతున్నారని, వీరిని ఉప్పల ట్రస్ట్ ద్వారా చదివించి పూర్తి బాధ్యతలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పిల్లల చదువుల బాధ్యతను ఉప్పల వెంకటేష్ తీసుకోవడం పిల్లల తల్లి పున్నమ్మ ఉప్పల వెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, మల్లేష్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

## విఆర్ఏల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

### - ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న విఆర్‌ఎలు

**చిన్నచింతకుంట, జులై 31 ప్రభాతవార్త :** విఆర్‌ఎల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రం మీదుగా మదనపురం వెళ్తుండగా ఎమ్మెల్యేను విఆర్‌ఎలు కలిసి వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేయాలని విఆర్‌ఎలు ఎమ్మెల్యేను కోరారు. విఆర్‌ఎల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తానని విఆర్‌ఎలకు ఎమ్మెల్యే తెలిపారు. విఆర్‌ఎ సంఘం నాయకులు రాములు, దేశన్న, రాజు, శ్యామ్, రఘు, మైనొద్దిన్, నాగరాజు, బాలమణి, రంగన్న పాల్గొన్నారు.

## శ్రీ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహరాజ్ జాతీయ వారోత్సవాల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైగౌడ ఉద్యమ నాయకులు

**నాగర్‌కర్నూల్ రూరల్,జులై 31 ప్రభాతవార్త :** సర్దార్ పాపన్న మహరాజ్ ధర్మపరిపాలన సంస్థ నేతృత్వంలో జైగౌడ్ ఉద్యమం జాతీయ కమిటి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ 372వ జయంతిని ఈనెల 7వ తేదీన జాతీయ వారోత్స వాలు హైదరా బాద్ రవింద్రభారతిలో నిర్వ హించడం జరుగుతుంది. కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జైగౌడ్ ఉద్యమం జిల్లా అధ్యక్షులు గుండ్రాతి నారాయణగౌడ్, మహిళా అధ్యక్షురాలు ప్రగతిగౌడ్, ప్రమీలగౌడ్, గౌరవాధ్యక్షులు రమేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, ప్రచార కార్యదర్శి సూర్య సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, జైగౌడ్ బిజినేపల్లి అధ్యక్షులు రంజిత్‌గౌడ్, కోడేరు అధ్యక్షులు కుందెన ఆంజనేయులుగౌడ్, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్, జైగౌడ్ నాయకులు తాడూరు ఆంజనేయులుగౌడ్, బొందలపల్లి రవిందర్‌గౌడ్, సూర్యశేఖర్‌గౌడ్, సూర్యతిరుపతిగౌడ్, శరత్‌గౌడ్, సతీష్‌గౌడ్, చిన్నగౌడ్, నరేష్‌గౌడ్‌లు పాల్గొని పాపన్న జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నూతన వధూవరులకు ఆశిర్వచన పత్రాలు అందజేత

**దేవరకద్ర రూరల్,జులై 31 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం అద్వర్యంలో నూతన వధూవరులకు ఆశిర్వచన పత్రాలు అందజేశారు. దేవరకద్రలో రమేశ్ కూతురు వివాహం సందర్భంగా ఆర్యవైశ్యులు ఈ ఆశిర్వ చన పత్రాలను సాంప్రదాయ ప్రకారం నూతన వధూవరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నూతన వధూవరులకు ఆశిర్వచన పత్రాలను అందజేస్తున్న దృశ్యం

## మార్కెట్‌చైర్మెన్‌కు సన్మానించిన వైస్ యంపీపీ

**దేవరకద్ర రూరల్,జులై 31 ప్రభాతవార్త:** మదనాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ శ్రవణ్‌కుమార్‌కు ఆదివారం దేవరకద్ర మండల వైస్ యంపీపీ తుమ్మల సుజాతశేఖర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అలాగే మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలకృష్ణ,కోయిల్‌సాగర ఉపసర్పంచ్ విశ్వనాథ్‌గౌడ్,మండల బిసి ఉపాధ్యాక్షుడు శేఖర్ తదితరులు కూడ శ్రవణ్‌కుమార్‌కు సన్మానించారు. ఈ సందర్బంగా శ్రవణ్‌కుమార్ ప్రమాణస్వీకారోత్స వ కార్యక్రమానికి దేవరకద్ర నుండి మండలం టీఆర్ఎస్ పార్టీ యువపాయకులు అధికసంఖ్యలో బయలుతేరి వెళ్ళారు.



శ్రవణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మండల వైస్ యంపీపీ తుమ్మల సుజాతశేఖర్‌రెడ్డి

## రోడ్డు ప్రమాద బాధితుడికి ఐక్యత ఫౌండేషన్ అండ

**వెల్దండ, జులై 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాఘాయిపల్లి గ్రామానికి చెందిన సాటు యాదయ్య హైదరాబాద్‌లో రోజు వారి కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కూలీ పని కోసం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగి హైదరాబాద్‌లోని జీవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలను మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య బాధితుడికి అందించారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. పరామర్శించిన వారిలో విజయ డైరీ చైర్మన్ కొండలుయాదవ్, చాన్‌పాషతో పాటు తదితరులు ఉన్నారు.



ప్రమాద బాధితుడిని పరామర్శిస్తున్న సభ్యులు

## అజిలాపూర్ గ్రామాన్ని నూతన మండలం ఇర్విన్‌లో కలుపాలి

**వెల్దండ, జులై 31, ప్రభాతవార్త:** సీఎం కేసీఆర్ ఇటీవల నూతన మండలాలకు ఆమోద ముద్ర వేయడంతో మాడ్గుల మండలంలోని ఇర్విన్‌ను నూతన మండలంగా ప్రకటించడంతో వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామాన్ని ఇర్విన్ మండలంలో కలుపాలని ఆదివారం సర్పంచ్ కాలే వెంకటమ్మ వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశమై తీర్మానించారు. అదే విధంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు అజిలాపూర్ గ్రామాన్ని నూతన మండలం ఇర్విన్‌లో కలుపాలని కోరుతూ వినతి పత్రం అందిస్తామన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు నూతన మండలం ఇర్విన్‌లో కలిపిస్తే రవాణాతో పాటు ఇతర ప్రభుత్వ పనులు త్వరితగతిన చేసుకోవచ్చుననే ఆలోచన ఒక వైపు అయితే... మరో వైపు మండలం మారితే మండలంతో పాటు జిల్లా కూడా మారాల్సి వస్తుందని, ఇర్విన్ మండలం రంగారెడ్డి జిల్లా కావడంతో జిల్లాలో పనులు కావాల్సి వస్తే రంగారెడ్డి జిల్లాకు వెళ్లాలని, రంగారెడ్డి జిల్లాలో ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ఇబ్బందులు ఏర్పడుతాయని కొందరు గుసగుసలాడుకుంటున్నారు.

# రూ. 100 కోట్లతో జర్నలిస్టు నిధి

- తెలంగాణ ఏర్పడితే తర్వాతే జర్నలిస్టుల సంక్షేమానికి కృషి
- రాష్ట్రం ఏర్పడ్డాక వలస వెళ్లిన వాళ్లు వాపస్ వస్తున్నారు
- తెలంగాణ వచ్చాక సర్కార్ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజెప్పాలి
- తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల మహాసభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 31 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జర్నలిస్టుల నుద్దేశించి మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని కాంక్షించి సీఎం కెసిఆర్ రూ. 100 కోట్లతో ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఊపర్ షేర్వాని అందరి పరేషానీ అన్న తీరుగా జర్నలిస్టుల పరిస్థితి ఉండేదని, సమైక్య రాష్ట్రంలో జర్నలిస్టులను అప్పటి ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాలతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉర్దూ భాషకు తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని ఉర్దూలో గ్రూప్ వన్ పరీక్షలు రాసేందుకు కూడా అవకాశం కల్పించాలని మంత్రి తెలిపారు. ఇమామ్‌లకు జీతం ఇస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మసీదులు, దర్గాల అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందజేస్తు ఒదని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జిల్లాలో ఆరు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలకు సమానంగా స్మశాన వాటికలు కేటాయించాలని సీఎం అసెంబ్లీలో పేర్కొన్న తీరుగా పట్టణం నలుమూలల ముస్లిం స్మశాన వాటికలకు స్థలం కేటాయించినట్లు తెలిపారు. కరోనా సమయంలో 5000 ముస్లిం కుటుంబాలకు బియ్యం నిత్యావసర సరుకులు అందించామన్నారు. జిల్లాలో డిసిసిబి, మైనార్టీ కార్పోరేషన్, మార్కెట్ కమిటి చైర్మన్ పదవులను మైనార్టీలకు కట్టబెట్టినట్లు తెలిపారు. అనారోగ్యం బారిన పడిన అనేకమందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించి కాపాడమన్నారు. అనేక మంది మైనార్టీలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. ఉర్దూ జర్నలిస్టులకు అందరికి అక్రిడేషన్లు అందించినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అటు హైదరాబాద్ ఇటు మహబూబ్‌నగర్‌లో మత కలహాలు అనే మాటకే అర్థం లేకుండా చేశామన్నారు. తమది సెక్యులర్ ప్రభుత్వం కావడం వల్లే అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. సీనియర్ ఉర్దూ జర్నలిస్టులు, ఎడిటర్లను మంత్రి ఈ సందర్భంగా సత్కరించారు. మైనార్టీ ఫైనల్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఇంతియాజ్, సియాసత్ న్యూస్ ఎడిటర్ అమీర్ అలీఖాన్, రేహనుమా ఈ దక్కన్ చీఫ్ ఎడిటర్ సయ్యద్ అమీర్ ఉల్లాఖాన్, మున్సిఫ్ ఎడిటర్ అక్తర్ మోహ్సిన్, మున్సిఫ్ చీఫ్ ఎడిటర్ ఎంఎ రెహ్మాన్, ఉర్దూ సీనియర్ జర్నలిస్టులు జకీ, సయ్యద్ అమీర్, ఉల్లాఖాన్, మోసిన్ పాషాఖాద్రి, అబ్దుల్ నజీర్, ఎంఎ ముజీబ్, మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, మార్కెట్ కమిటి ఛైర్మన్ రెహమాన్, పిఎసిఎస్ ఛైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు, కౌన్సిలర్లు మోసిన్ సాదత్, ఉర్దూ ఫోరం సెక్రెటరీ ఎండి మోహ్సిన్, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హాజరైన జర్నలిస్టులు

# నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం సాగిస్తాం

- నిర్వాసితుల గోడు పట్టించుకోని అధికారులు
- కాంట్రాక్టులు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే
- అసమర్థ ఎమ్మెల్యే వెంటనే రాజీనామా
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచాల యుగంధర్ గౌడ్

**కొత్తకోట, జులై 31 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే కాంట్రాక్టులు, కమిషన్లకే పరిమితమవుతూ, ప్రజా సమస్యలను గాలికొదిలేశారని బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచాల యుగంధర్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం కొత్తకోటలో సంకరసముద్రం నిర్వాసితులతో కలిసి ఆమరణ నిరాహారదీక్ష గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ శంకరసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద భూములు, ఇండ్లు కోల్పోయి నిర్వాసితులు దిక్కుతోచని స్థితిలో కాలువ పరిధిలోని దాదాపు 21వేల ఎకరాల ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్, ఆర్ సెంటర్లో కనీస వసతులు కూడా ఏర్పాటు చేయలేదని, స్థానిక ఎమ్మెల్యే ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పునరావాస కేంద్రంలో ప్లాట్ల కోసం చూపబడిన భూమి ఎత్తులు తగ్గులతో ఇండ్ల నిర్మాణాలకు ఏమాత్రం అనుకూలంగా లేదన్నారు. శంకర సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తి అయితే కొన్ని వందల గ్రామాలకు సాగునీరు అందుతుందని, ఇది పూర్తి కాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యలను ఎన్నోసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, నిర్వాసితులతో కలిసి పాదయాత్రలు చేశామని, ధర్నాలు చేశాయని, కానీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, అందుకే తప్పనిసరి పరిస్థితులలో ఆమరణ నిరాహార దీక్ష దీక్ష చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మేము నిర్వాసితుల సమస్యలపై మాట్లాడినప్పుడే ఎమ్మెల్యే నిద్ర లేచి కలెక్టర్ దగ్గరికిపోయి హడావుడి చేస్తారని ఆ తర్వాత నిర్వాసితులను గాలికొది లేయడం గత కొన్ని సంవత్సరాలుగా చూస్తున్నామన్నారు. ఇప్పటికి స్థానిక ఎమ్మెల్యే పాత పద్దతి మాదిరిగా నిర్వాసితులకు కల్లిబొల్లి కబుర్లు చెప్పి సమస్యను పక్కదారి పట్టించాలని చూస్తున్నాడు తప్ప పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ఆయనలో కనబడడం లేదని విమర్శించారు. నిర్వాసితుల సమస్యల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఆగష్టు 3వ తేదీ లోపు నిర్వాసితులతో సమావేశమై ఎన్ని రోజుల్లోపు పరిష్కరిస్తారో కలెక్టర్ నిర్వాసితులకు లిఖితపూర్వక హామి ఇప్పించాలని లేనిపక్షంలో ఆగష్టు 04వ తేదీన యధావిధిగా ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ ఉపాధ్యక్షుడు భీమన్న నాయుడు, బీసీ మహిళా సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు హారతి, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, అడ్డాకుల మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మదనాపురంమహేందర్ నాయుడు, వనపర్తి మండల అధ్యక్షుడు తిరుపతయ్య గౌడ్, గ్రామానికి చెందిన నిర్వాసితులు బాజా గీరన్న, నక్క రాములు, సాయికిరణ్, మద్దిలేటి, భాను కిషోర్, పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న రాచాల యుగంధర్ గౌడ్

# నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత కల్పించాలి

### - డిసిసిబి సీఈఓకు సింగిల్‌విండో ఛైర్మన్ హన్మంతురెడ్డి వినతి

**లింగాల, జులై 31 ప్రభాతవార్త :** గిరిజనులు అధికంగా నివసించే లింగాల మండలంలోని అంబటిపల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ నిధుల కేటాయింపులో తమకు అధిక ప్రాధాన్యత కల్పించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిసిసిబి సీఈఓ లక్ష్మయ్యను కలిసి సమస్యలను విన్నవించినట్లు సింగిల్ విండో అధ్యక్షులు జంబుల హనుమంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమకు సరైన నిధులు లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. అంబటిపల్లి ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధి కోసం సహకరించాలని కోరినట్లు వెల్లడించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో రికవరీ చేయించడానికి చర్యలు తీసుకున్నట్లు సీఈఓ దృష్టికి తీసుకుని వచ్చినట్లు తెలిపారు. నూతన క్రాప్‌లోన్లు, ఎల్టిలోన్లు మంజూరు చేసినట్లయితే రైతులకు న్యాయం చేసిన వారవుతారని తెలిపారు. సరైన నిధులు కేటాయిస్తూ నూతన గోదాం నిర్మాణం మంజూరు చేయాలని కోరారు. అలాగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరడం జరిగిందన్నారు. సొసైటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సీఈఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నిధుల కేటాయింపులో ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ ఛైర్మన్ వెంకటగిరి, సింగిల్‌విండో డైరెక్టర్, మాజీ ఛైర్మన్ జంబుల వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల జిల్లా కమిటీ ఎన్నిక

**కల్వకుర్తి, జులై 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కమిటీని కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నికకు రాష్ట్ర అధ్యక్షులు సైదాఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ షబ్బీర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాసీంబాయి, రాష్ట్ర కోశాధికారి ఎండీ.షాదుల్లా భాయి, రాష్ట్ర జాయింట్ సెక్రటరి ఎండీ.జానీబాబా, రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ రషీద్‌బాయి, మేడ్చేల్ జాయింట్ సెక్రటరి సలీం, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి యూసుఫ్‌బాబలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని సంచార ముస్లిం తెగలకు సంబంధించి నాగర్‌కర్నూల్, గౌరారం, అచ్చంపేట, బిజినేపల్లి, గగ్గలపల్లి, కల్వకుర్తి, మార్చాల గ్రామాల్లోని ముస్లిం సోదరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సైదాఖాన్ మాట్లాడుతూ సంచార ముస్లిం తెగుల వారు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి అన్ని విధాల అభివృద్ధి చేసే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా నూతన కమిటీలను వేస్తున్నామని, అందులో భాగంగానే నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీని ఎన్నుకుంటున్నామని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ అధ్యక్షులు ఎండీ.రహీమ్ (మార్చాల), ఉపాధ్యక్షులుగా ఫరీద్ (గగ్గలపల్లి), మహబూబ్(గౌరారం), సెక్రటరిగా మౌలాలి(నాగర్‌కర్నూల్), జాయింట్ సెక్రటరిగా జహంగీర్ (అచ్చంపేట), కోశాధికారిగా ముస్తాఫా (మార్చాల) వీరితో పాటు మరో 15 మందిని ఆర్గనైజర్, సలహాదారులు, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ.షబ్బీర్ నియామక పత్రం అందించగా... రాష్ట్ర అధ్యక్షులు సైదాఖాన్ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా మండలాల సంచార ముస్లిం తెగల సభ్యులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కమిటీ



జిల్లా కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న మొహమ్మద్ షబ్బీర్

# కేతెపల్లిలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పాన్‌గల్,జులై31 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కేతెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1887-88 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో చదువుతున్న సమయంలో విద్య నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 10వ తరగతి పూర్తయిన 35 సంవత్సరాల తర్వాత మళ్లీ చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడం వెలకట్టలేని అంత ఆనందంగా ఉందన్నారు. తమ ఎదుగుదలకు పునాది వేసిన కేతెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.



విద్య నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

## విఆర్ఏ అంత్యక్రియలలో పాల్గొన్న దేవరకద్ర బాలన్న


**అడ్డాకుల, జులై 31, ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండలం కొన్నూరు గ్రామానికి చెందిన ఉప్పరి నర్సన్న (విఆర్ఎ) శనివారం రాత్రి మృతి చెందారు. బిజెపి రాష్ట్ర నాయకులు దేవరకద్ర బాలన్న ఆదివారం నర్సన్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సన్న అంత్యక్రియలలో పాల్గొన్నారు. గత కొన్ని రోజులుగా ధర్నా చేస్తున్న విఆర్ఎ నర్సన్న మృతికి రాష్ట్ర ప్రభుత్వం బాద్యత వహించి 10 లక్షల రూపాయలు మృతుని కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఆర్ఎలు చేస్తున్న ధర్నాకు పూర్తి మద్దతు ప్రకటించారు.



నర్సన్న పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న దేవరకద్ర బాలన్న

## మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం

**అడ్డాకుల, జులై 31, ప్రభాతవార్త:** మదనాపురం మార్కెట్ కమిటీ సభ్యులుగా అడ్డాకుల గ్రామానికి చెందిన సింగిల్‌విండో అధ్యక్షులు జితెందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఎలుసరి శ్రీనివాసులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. సాయంత్రం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ నాయకులు మార్కెట్ కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు.



మార్కెట్ కమిటీ సభ్యులను సన్మానం చేస్తున్న నాయకులు

## రైతు భీమా దరఖాస్తు గడువు పొడగించాలి

### - యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వహిద్

**పాన్‌గల్, జులై 31 ప్రభాతవార్త:** పట్టా పాసుపుస్తకాలు కలిగిన రైతులు తెలంగాణ ప్రభుత్వం కల్పించిన రైతు భీమాకు అర్హత పొందేందుకు దరఖాస్తు చేసుకునే గడువు పొడగించాలని కొల్లాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వహిద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు, గ్రామాలలో రైతులకు చివరి తేదీ గడువుపై అవగాహన లేక చాలా మంది రైతులు దరఖాస్తులను మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందిచలేక పోయారని తెలిపారు. పైగా దరఖాస్తు చివరిరోజు ఆదివారం కావడం కూడా సమస్య అయిందన్నారు. అందుకోసం అర్హులైన రైతుల కోసం రైతు భీమాకు దరఖాస్తు చేసుకునే గడువును పొడగించాలని ఆయన కోరారు.



## క్లాస్‌మేట్ కుటుంబానికి బాసటగా నిలిచిన పూర్వ విద్యార్థులు



శాఖాపూర్‌లో క్లాస్ మేట్ కుటుంబానికి ఆర్థిక సాహాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

**పాన్‌గల్, జులై 31 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని శాఖాపూర్ గ్రామానికి కరుణాకర్ అనే వ్యక్తికి బాసటగా నిలిచారు. తోటి క్లాస్ మేట్స్ 2009 సంవత్సరం లో పాన్‌గల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తనతో పాటు చదువుకున్న కరుణాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని సంకల్పంతో అందరు కలిసి పోగుచేసిన రూ.28వేలు నగదును ఆదివారం మృతుడు కరుణాకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇకమీదట తమతో పాటు చదువుకొని ఆపదలో ఉన్న ప్రతి క్లాస్ మేట్ తమ వంతుగా ఆదుకుంటామని తెలిపారు. గ్రామ ఎంపీటీసీ సుబ్బయ్య, మండల కోఆప్షన్ సభ్యులు అలిమ్, క్లాస్ మేట్స్ పాల్గొన్నారు.

## నేడు గోదాదేవి రంగనాథస్వామి రథోత్సవం

**శ్రీరంగాపురం, జులై 31 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఆదివారం రాత్రి 8గంటలకు శ్రీగోదాదేవి రంగనాథస్వామి కళ్యాణం జరుగుతందని ఆలయ అర్చకులు కన్నయ్య తెలిపారు. సోమవారం ఉదయం 10పది గంటలకు రథోత్సవం(చిన్నతేరు) రథంలో గోదాదేవి అమ్మవారిని కూర్చోబెట్టి రథాన్ని ఊరేగిస్తారు. అందుకే బ్రహ్మోత్సవాలలో తాము ఓ చేయి వేసి రథాన్ని లాగుతే తమకు పుణ్యం దక్కుతుందని భక్తులు పోటీలు పడుతుంటారు కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

## పాత పెన్షన్ విధానం అమలుకు కృషి

### -టిఎస్సీపిఎస్ ఈఎస్ జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి




సమావేశంలో మాట్లాడుతున్న సనాతన బాలస్వామి

**భూత్పూర్,జులై 31 ప్రభాతవార్త :** 2004 సెప్టెంబర్ ఒకటో తేదీనుండి పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానాన్ని అమలుకు కృషి చేస్తోందని ఈ విధానం వల్ల ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో ఏర్పడిన ఏకైక యూనియన్ టిఎస్ సిపిఎస్ ఈఎస్ అని అన్నారు. ఆదివారం జరిగిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ యూనియన్ ఉద్యోగుల పాన్‌కార్డు, గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ వంటివి ఇప్పించడంలో విజయం సాధించిందని చెప్పారు.

